సాక్షి
శ్రీకాకుళం
బుధవారం । 20 । నవంబర్ । 2024



ప్రా'ధాన్యం' ఏదీ..?

ధాన్యం సేకరణకు ప్రక్రియ పూర్తి కాలేదు. కసరత్తుల్లోనూ అలసత్వం కనిపిస్తోంది.

- 8లో



కేఎల్ఎన్‌పేటలో భారీ చోరీ

కేఎల్ఎన్‌పేటలో భారీ చోరీ జరిగింది. 16 తులాల బంగారం చోరీ చేశారు.

- 8లో

నవోదయ దరఖాస్తు గడువు పెంపు

సరుబుజ్జిలి: 2025–26 విద్యా సంవత్సరానికి గాను వెన్నెలవలస జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11 తరగతుల్లో ఖాళీ సీట్లు భర్తీ చేసేందుకు నవంబర్ 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని విద్యాలయం ప్రిన్సిపాల్ డి.పరశురామయ్య మంగళవారం ప్రకటనలో వెల్లడించారు. దరఖాస్తులు నవోదయ వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.

న్యూస్‌రీల్

బీఈడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పరిధిలోని బీఎడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల, ఇంజినీరింగ్ కాలేజ్, రాజాం జీసీఎస్ఆర్, పాలకొండ డిగ్రీ కళాశాల, టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 22వ తేదీ వరకు పరీక్షలు జరగనున్నాయి. 901 మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షల నిర్వహణను ఎగ్జామినేషన్స్ డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ పర్యవేక్షిస్తున్నారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఇద్దరు ఎంపిక



ఎంపికైన స్పందన, సాయిగీతికలతో ఎస్‌జీఎఫ్ అధికారులు, పీడీలు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి స్కూల్‌గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు జిల్లాకు చెందిన బుడుమూరు స్పందన, దుప్పల సాయిగీతికలు ఎంపికయ్యారు. ఈ పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గుజరాత్‌లోని రాజ్‌కోట్ వేదికగా ఈనెల 24 నుంచి 30 వరకు జరగనున్నాయి. 200 మీటర్ల ఫ్రీ స్టైల్‌లో స్పందన, 400మీటర్ల ఫ్రీ స్టైల్, 200మీటర్ల బటర్ ఫ్లై విభాగంలో జాతీయ పోటీల్లో ప్రాతినిధ్యం వహించనున్నట్టు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు, డీఈఓ డాక్టర్ తిరుమల చైతన్య, కార్యదర్శి బిడి వెంకటరమణ తెలిపారు. వీరిని తీర్చిదిద్దుతున్న స్విమ్మింగ్ కోచ్ ఎస్‌కె సుభాన్, అసిస్టెంట్ కోచ్ కిశోర్‌లను ప్రత్యేకంగా మెచ్చుకున్నారు.

ఆదిత్యుని హుండీ ఆదాయం రూ.68.85లక్షలు



హుండీ ఆదాయం లెక్కింపును పర్యవేక్షిస్తున్న ఆలయ ఈఓ భద్రాజీ

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల ద్వారా రూ.68,85,700 మేరకు ఆదాయం లభించిందని ఆలయ ఈఓ. వై.భద్రాజీ పేర్కొన్నారు. మంగళవారం ఆలయ అనివెట్టి మండపంలో నిర్వహించిన హుండీ కానుకల లెక్కింపులో నగదు రూపంలో రూ.67,09,160 చిల్లర రూపంలో రూ.1,76,540 లభించినట్టు తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు 27 నుంచి ఈనెల 19వ తేదీవరకు 84 రోజులకుగాను హుండీల ద్వారా ఇంత మొత్తంలో ఆలయానికి ఆదాయం లభించిందన్నారు. అలాగే 25 గ్రాముల బంగారం, కేజీ 600 గ్రాముల వెండి వస్తువులు మొక్కుబడి రూపంలో లభించాయని భద్రాజీ తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, సూపరింటెండెంట్ కనకరాజు, సీనియర్ అసిస్టెంట్ జీవీబీఎస్ రవి కుమార్, ఆమదాలవలస ఈఓ. తమ్మినేని రవి పర్యవేక్షించారు.

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి




మాట్లాడుతున్న మాధవరావు

పలాస: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తెలుగుదేశం ప్రభుత్వ కూటమి భాగస్వాములు వెంటనే అమలు చేయాలని అఖిల భారత రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంకల మాధవరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస సూదికొండ కాలనీలోని ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతుల ఖాతాల్లో తక్షణమే రూ.20వేలు జమచేయాలని కోరారు. కౌలు రైతులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయాలన్నారు.

జీడి మామిడిపంటకు కూడా బీమా రుసుం ప్రభుత్వమే చెల్లించాలని కోరారు. సమావేశంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు జుత్తు వీరాస్వామి, బంగ్లాకుమార్, సవర సోమేశ్వరరావు, సంతోష్, వెంకటేష్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ కక్ష.. చిరుద్యోగులకు శిక్ష



- చిరుద్యోగులపై కొనసాగుతున్న వేధింపులు
- తాత్కాలిక, దినసరి,అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగిస్తున్న కూటమి ప్రభుత్వం
- ప్రస్తుతం ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ల వంతు
- మంత్రి అచ్చెన్న నియోజకవర్గంలో అత్యధికంగా తొలగింపు
- వందలాది మందిని తొలగించేందుకు రంగం సిద్ధం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అధికార పక్ష నాయకులు పెంచుకున్న రాజకీయ కక్ష.. చిరుద్యోగుల పాలిట శిక్షగా మారుతోంది. ఇంటికో ఉద్యోగమని ఊదరగొట్టిన కూటమి నాయకులు ఇప్పుడు ఉన్న ఉద్యోగులను తీసేస్తున్నారు. ఉద్యోగం ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామన్న కూటమి ప్రభుత్వం, ఇప్పుడా హామీని గాలికొదిలేసి ఇప్పటికే పనిచేస్తున్న ఉద్యోగుల జీవితాలను ఛిద్రం చేస్తోంది. దశల వారీగా తొలగింపు కార్యాచరణ అమలు చేస్తున్నారు. తొలుత మధ్యాహ్న భోజన కార్మికులపై పడ్డారు. ఆ తర్వాత రేషన్ డిపో డీలర్లు, యూనివర్సిటీ ఉద్యోగులపై వేటు వేశారు. గ్రామ సమాఖ్య సహాయకులు(వీఎఓ), వైద్య ఆరోగ్యశాఖలోని చిరుద్యోగులు, దేవాలయాల్లో పనిచేసే తాత్కాలిక ఉద్యోగుల్ని వదలేదు. ఇప్పుడు ఫీల్డ్ అసిస్టెంట్లపైనా, 108,104 ఉద్యోగులపై పడ్డారు. ఉద్యోగుల ఉపాధి తీసే పనిలో నిమగ్నమయ్యారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల మెడపై తొలగింపు కత్తి..

అధికారంలోకి వస్తే ఏడాదికి 4లక్షలు చొప్పున ఐదేళ్లలో 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉన్న ఉద్యోగాల్ని పీకేస్తోంది. చంద్రబాబు అండ్‌కో చెప్పిన మేరకైతే జిల్లాలో నిరుద్యోగులుగా ఉన్న 7లక్షల 28వేల 910మందికి ఉద్యోగాలు కల్పించాలి. ఈ లోపు వారికి నెలకి రూ. 3వేలు చొప్పున నిరుద్యోగ భృతి అందించాలి. ఆ విషయాన్ని పక్కన పెట్టి ఇప్పుడు ఎక్కడెక్కడ కానివారు చిరు ఉద్యోగులుగా ఉన్నారో గుర్తించి వారందరినీ ఏరివేసేందుకు కంకణం కట్టుకున్నారు. ఎక్కడైతే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, కాంట్రాక్ట్ ఉద్యోగులున్నారో వారందర్నీ తీసేస్తున్నారు. ప్రస్తుతం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్ల మెడపై తొలగింపు కత్తి పెట్టారు. ఇప్పటికే జిల్లాలో 41మందిని తీసేశారు. మరో 60మందిని తీసేసేందుకు రంగం సిద్ధం చేశారు. మున్ముందు మరింత మందిని తొలగించాలని చూస్తున్నారు. తప్పుడు అభియోగాలు మోపి, కూటమి నాయకుల సిఫార్సుల మేరకు అధికారులు తొలగిస్తున్నారు. అత్యధికంగా మంత్రి అచ్చెన్నాయుడు నియోజకవర్గంలో నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నారు ఇక్కడ ఒక్కచోటే 21మందిని తొలగించారు.

చాంతాడంత జాబితా..

- కూటమి నాయకుల రాజకీయ కక్షలకు, వేధింపులకు చిరుద్యోగులు బలైపోతున్నారు. చిన్నపాటి ఉద్యోగంతో కుటుంబాలను పోషించుకుంటున్న వారందరినీ తీసేస్తే తప్ప ప్రస్తుత పాలకుల కడుపు చల్లారడం లేదు.
- 2014–19లో ఏ రకంగానైతే డ్వామా, డీఆర్‌డీఎ, హౌసింగ్, వ్యవసాయ శాఖలో పనిచేసిన అవుట్ సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులను తొలగించారో అదే రకంగా ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు.
- ఇసుక, మద్యం దోపిడీ, భూకబ్జాలు, కాంట్రాక్ట్ అక్రమాలే కాదు చిరుద్యోగుల తొలగింపు కూడా పునరావృతం చేస్తున్నారు.
- వలంటీర్ వ్యవస్థను ఆపేయడంతో జిల్లాలో ఇప్పటికే 15,328 మంది రోడ్డున పడ్డారు. తాము అధికారంలోకి వస్తే రూ. 10వేలు జీతం ఇస్తామని చెప్పిన చంద్రబాబు అండ్‌కో ఇప్పుడీ వ్యవస్థనే ప్రశ్నార్థకం చేసింది.
- కూటమి ప్రభుత్వం వచ్చాక జిల్లాలో 90మంది మధ్యాహ్న భోజనం కార్మికులను, 40మంది ఆయాలను తొలగించారు. మరో వంద మందిని తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అధికార పార్టీకి అనుకూలంగా లేని వారందరినీ తొలగించి, వారి ప్లేస్‌లో పచ్చ కండువాలు కప్పుకున్న వారిని వేసుకునేందుకు ప్లాన్ చేశారు.
- ప్రభుత్వ జీఓ ఆధారంగా 12 మంది వర్సిటీలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులను తొలగించారు. గతంలో నియమించిన 34 ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించాలని చూస్తున్నారు.
- రాజకీయ కక్షతో శ్రీకాకుళం నగర పాలక సంస్థలో శానిటరీ మేస్త్రీలను తొలగించారు.
- 108, 104ఉద్యోగుల మెడపై కూడా కత్తి పెట్టారు. కాంట్రాక్ట్ డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.
- రేషన్ డీలర్లపైనా కన్నేశారు. ఇప్పుడున్న డీలర్లను తొలగించి వారి స్థానంలో తమ వాళ్లను వేసుకోవడానికి మండలాల వారీగా జాబితాలు తయారు చేసి, అధికారులకు ఇచ్చారు. ఒకేసారి తీసేస్తే రచ్చ అయిపోతుందని దశల వారీగా తొలగింపు కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఇప్పటికే తొలగించిన వారి సంఖ్య డబుల్ డిజిట్‌లో ఉంది.
- అరసవిల్లి సూర్యనారాయణస్వామి దేవాలయంలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న 48మంది దినసరి ఉద్యోగుల పరిస్థితి అయోమయంగా తయారైంది. పొమ్మనకుండా పొగ బెట్టినట్టు జీతాలు ఇవ్వకుండా గాలికొదిలేశారు. ఉచితంగా సేవ చేయాలనుకుంటే రండి లేదంటే ఉండిపోండి అని అధికారులు ఇప్పటికే సెలవిచ్చారు.



● శక్తి స్వరూపిణి

సత్యసాయిబాబా 99వ జయంత్యుత్సవంలో భాగంగా మంగళవారం పలాస సత్యసాయి మందిరంలో శక్తి స్వరూపిణి దినోత్సవం నిర్వహించారు. అందులో భాగంగా చిన్నారులు నృత్య విన్యాసాలతో అలరించారు. – కాశీబుగ్గ

- గ్యాంగ్‌లో ఆరుగురు అరెస్టు
- మరొకరు ఇప్పటికే జైలులో..
- రూ. 15.5 లక్షల విలువైన 20 ద్విచక్రవాహనాలు స్వాధీనం

బైక్ చోరీ గ్యాంగ్ ఆటకట్టు



పట్టుబడిన ద్విచక్రవాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి. చిత్రంలో డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్ : గత రెండేళ్లుగా బైక్‌చోరీలకు పాల్పడుతున్న గ్యాంగ్‌ను ఆమదాలవలస పోలీసు లు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 15.5 లక్షల విలువైన 20 ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నారు. బైక్ చోరీలే కాక బ్యాటరీలు, ల్యాప్‌టాప్‌లు, మొబైళ్లు, వైన్‌షాపు రోబరీల్లో నిందితులైన ఆరుగురిని అరెస్టు చేశారు. ఈ నేరాలతో సంబంధమున్న మరో వ్యక్తి గంజాయి కేసులో ఇప్పటికే జైలు శిక్ష అనుభవిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పత్రికా విలేకరుల సమావేశంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు.

గత నెల 5వ తేదీ రాత్రి ఆమదాలవలసకు చెందిన ప్రైవేటు ఉద్యోగి కరణం శ్రీనివాసరావు తన ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ వివేకానంద పర్యవేక్షణలో రంగంలోకి దిగిన ఆమదాలవలస సీఐ సత్యనారాయణ, ఎస్ఐ కె.వెంకటేష్‌లు తమ సిబ్బందితో కలసి దర్యాప్తు కొనసాగించారు.

విచారణ కొనసాగించగా..



అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం వెంకయ్యపాలెం గ్రామానికి చెందిన మైలపల్లి అర్జునరావు (37) దివ్యాంగుడు కావడం, ఏ పనిచేయక ఆర్థిక ఇబ్బందుల్లో ఉండేవాడు. ఇతనికి ఆమదాలవలస కంద్రపేటకు చెందిన కారుణ్య జగదీష్, పలాస మండలం అంబుసోలికి చెందిన జడ్యాడ సోమేశ్వరరావు (21), విజయనగరం జిల్లా కొమరాడ మండలం కొట్టు గ్రామానికి చెందిన సప్ప హరీష్ (21), ఆమదాలవలస మెట్టెక్కివలసకు చెందిన మదాసు ధనుష్ (19)లు పరిచయమయ్యారు.

పథక రచన చేశారిలా..

అర్జునరావు వీరందరికి ఖర్చులకు డబ్బులివ్వడమే కాక ఉండటానికి గది అద్దెకిచ్చి రాత్రి పూట బైక్, ఇతర చోరీలు ఎలా చేయాలన్న దానిపై ప్రణాళిక రూపొందించేవాడు. దొరికిన బైక్‌లను ఏపీలో అమ్మితే సమస్య అని, ఒడిశాలో అమ్మితే పోలీసులకు దొరికే అవకాశముండదని ఒడిశా గజపతి జిల్లా మినిగాన్‌కు చెందిన తన మిత్రుడు దారపు శేషగిరి (42) అతని బంధువైన ఏరుపల్లి బాలాజీ (తురకపేట)ల సాయంతో అమ్మేవారు.

పట్టుబడ్డారిలా..

ఈ క్రమంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ఆమదాలవలస మున్సిపాలిటీ గేట్ స్కూల్ కూడలి వద్ద ఎస్ఐ వెంకటేష్, తమ సిబ్బందితో కలిసి నిందితులను పట్టుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో జడ్యాడ సోమేశ్వరరావుపై విజయనగరం బొబ్బిలిలో మూడు, కాశీబుగ్గ, ఆమదాలవలసల్లో ఒక్కొక్కటి చొప్పున పాత కేసు లుండగా సప్ప హరీష్‌పై బొబ్బిలిలో మూడున్నాయి. ఈ ఏడాది ఎన్డీపీఎస్ (గంజాయి) కేసులో అంపోలులో జైలుశిక్ష అనుభవిస్తున్న కారుణ్య జగదీష్‌పై బొబ్బిలిలో మూడు, ఆమదాలవలసల్లో నాలుగు కేసులుండటం విశేషం.

స్వాధీనం చేసుకున్న బైక్‌లు ఎక్కడెక్కడివి అంటే..

ఆమదాలవలస పీఎస్ పరిధిలో ఐదు, కాశీబుగ్గ పీఎస్ పరిధిలో ఐదు, శ్రీకాకుళం రూరల్, విజయనగరం 1టౌన్, విశాఖపట్నం3 టౌన్, లావేరు, ఎచ్చెర్ల పీఎస్‌ల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున కాగా మరో ఐదు ద్విచక్రవాహనాలు వివరాలు తెలియాల్సి ఉంది. డీఎస్పీ వివేకానంద ఆధ్వర్యంలో కేసును చాకచక్యంగా ఛేదించిన సీఐ సత్యనారాయణ, ఎస్ఐ వెంకటేష్, పీసీలు రాధాకృష్ణ, శ్యామలరావు, బాలకృష్ణలను ఎస్పీ అభినందించారు.

ఇంటి ముందు గంజాయి మొక్క



పైడిపేటలో గంజాయి మొక్కను స్వాధీనం చేసుకుంటున్న రెవెన్యూ, పోలీసులు

రణస్థలం: మండలంలోని కోష్ట పంచాయతీలో గల పైడిపేట గ్రామంలో పసుపురెడ్డి నూకరాజు అనే వ్యక్తి తన ఇంటి వద్ద గంజాయి మొక్క పెంచుతున్నారని తెలిసి జేఆర్ పురం పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. ఆ వ్యక్తిని అదుపులోనికి తీసుకుని రెవెన్యూ అధికారుల సమక్షంలో మొక్కను స్వాధీనం చేసుకున్నారు. జేఆర్ పురం ఎస్ఐ ఎస్. చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మండల తహసీల్దార్ ఎస్.ప్రసాద్, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



● ముంగిట ముగ్గు

స్థానిక మహాత్మాగాంధీ స్మారక శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొన్నారు. – సారవకోట

రీచుల్లో రాబంధువులు



వంశధార నదిలో జేసీబీలతో ట్రాక్టర్లకు లోడింగ్ చేస్తున్న దృశ్యం

- గోపాలపెంట ఇసుక ర్యాంపులో యథేచ్ఛగా నిబంధనల ఉల్లంఘన
- పట్టించుకోని అధికారులు
- ర్యాంపు నిర్వాహకులు టీడీపీ కార్యకర్తలు, ఎమ్మెల్యే బంధువులే
- అన్ని ర్యాంపులు చేజిక్కించుకోవడానికి చక్రం తిప్పుతున్న ఎమ్మెల్యే బంధువులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఇసుక రీచులపై రా'బంధువులు' వాలుతున్నాయి. ర్యాంపుల్లో కాసుల వేట జరుగుతుండడంతో అధికార పక్ష నేతల బంధువులు ఎక్కడెక్కడి నుంచో వచ్చి వాలిపోతున్నారు. నిర్మాణ రంగం కుదేలు కాకుండా ఉండేందుకు వీలుగా జిల్లాలో కొన్ని ఇసుక ర్యాంపులను లారీలకు లోడ్ చేసేందుకు అనుమతులు ఇచ్చారు. ఇందులో మండల పరిధిలోని గోపాలపెంట ఇసుక ర్యాంపు ఒకటి. దీన్ని ఎమ్మెల్యే బంధువులకే కట్టబెట్టారు. స్థానిక టీడీపీ కార్యకర్తలే అంతా చూస్తున్నారు. దీంతో తమకు అడ్డు లేదనుకొని ఇష్టానుసారంగా నిబంధనలు పక్కన పెట్టి ర్యాంపు నిర్వహిస్తున్నారు.

అంతటా నిబంధనల ఉల్లంఘనే..

గోపాలపెంట ర్యాంపులో అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఇక్కడ వాల్టా చట్టాన్ని పట్టించుకోవడం లేదు. నదిలో ఇసుక లోడింగ్ మనుషుల ద్వారా చేయాలని ప్రభుత్వం చూచిస్తే యంత్రాలు వినియోగిస్తున్నారు. ఇక్కడ మూడు జేసీబీలు పనిచేస్తున్నాయి. రోజూ 23 ట్రాక్టర్లు వినియోగించి ఇసుకను డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టరు రోజుకు 10 లోడ్లు వేస్తుంది. వీరికి ఒక్కో లోడుకు రూ. 270 చెల్లిస్తున్నారు. నదిలోనికి ఇతరులు ఎవరూ వెళ్లకుండా ఎక్కడికక్కడ టీడీపీ కార్యకర్తలు కాపలా కాస్తున్నారు. ర్యాంపు వద్ద సీసీ కెమెరాలు లేకపోవడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా సాగిపోతోంది. స్వయంగా ఎమ్మెల్యే బంధువులే ర్యాంపు నిర్వహిస్తుడంటంతో అధికారులు ఇటువైపు చూడనైనా చూడడం లేదు. లారీలతో పాటు ట్రాక్టర్లు తిరగడం వల్ల రోడ్డుపై ధూళి ఎగసిపడుతోంది. కనీసం వాటరింగ్ అయినా చేయడం లేదని గోపాలపెంట, పోతయ్యవలసలకు చెందిన పలు కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.



రాత్రి సమయాల్లో లోడుతో వెళ్తున్న లారీ

పగలూ రాత్రి..

గోపాలపెంటలో ఇసుక ర్యాంపును అక్టోబరు 17న కలెక్టర్ ప్రారంభించారు. 24 వ తేదీ నుంచి అధికారికంగా ర్యాంపు నడుస్తోంది. సోమవారం నాటికి అధికారికంగా 78 లారీల ఇసుకను మాత్రమే విక్రయించారు. సెలవు రోజులు పోనూ ర్యాంపు పనిచేసిన రోజుల్లో సరాసరిన రోజుకు 6 లారీలు చొప్పున విక్రయాలు చేశారు. అయితే అనధికారికంగా వందల లోడ్లు తరలాయి. రాత్రి సమయాల్లో ఇసుక ర్యాంపు నిర్వహణకు అనుమతి లేకపోగా టీడీపీ కార్యకర్తలే అంతా తామై ఇసుకను రోజుకు పదుల సంఖ్యలో తరలిస్తున్నారు. అలాగే లారీల్లో పరిమితికి మించి లోడింగ్ చేస్తూ అదనపు ఇసుకకు వేరే రేటు తీసుకుంటున్నారు. ఉదాహరణకు పగలు కూడా ఒక లారీ 12 టన్నులకు డీడీ తీస్తే 20 టన్నుల వరకూ లోడింగ్ చేసి డబ్బులు అదనంగా తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటలు వరకూ సచివాలయ సిబ్బందికి డ్యూటీలు వేశారు. వీరు వెళ్లిన తర్వాత వ్యవహారం అంతా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతుంది. అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. తనిఖీలు చేయడం లేదు.

మరో మూడు ర్యాంపుల స్వాధీనానికి ప్రయత్నాలు

మండలంలో మడపాం, కొబగాం వెంకటాపురం, ఉప్పరిపేట వద్ద మరో మూడు ర్యాంపులను ప్రభుత్వం మంజూరు చేయనుంది. ఈ మేరకు జిల్లా ఇసుక కమిటీ షీల్డు టెండర్లను ఆహ్వానిస్తూ ఒక ప్రకటన చేసింది. వీటిని కూడా ఎమ్మెల్యే బంధువులు చేజిక్కించుకుని అందిన మేరకు లాగేయడానికి చూస్తున్నారు. స్వయానా ఎమ్మెల్యే భార్య బంధువులు రంగ ప్రవేశం చేసి పావులు కదుపుతున్నారు. నియోజకవర్గంలో ఇసుక వ్యాపారం అంతా తమ కనుసన్నల్లోనే జరిగే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో మండలంలోని టీడీపీ కేడరు, జనసేన కేడరు గుర్రుగా ఉన్నట్లు సమాచారం.



● మణి'ఫర్నిక'

ప్రహరాజపాలెంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి 196వ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారి ఫర్నిక ఝాన్సీ లక్ష్మి వేషధారణలో అలరించింది. ఝాన్సీ లక్ష్మీబాయి జీవిత చరిత్రపై వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. – పాతపట్నం

క్లుప్తంగా

బెల్టుషాపులు పెడితే కేసులు



పురుషోత్తపురం చెక్‌పోస్టును పరిశీలిస్తున్న డీసీ శ్రీకాంత్‌రెడ్డి

ఇచ్ఛాపురం: మద్యం దుకాణాదారులు ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డి.సి. డి.శ్రీకాంత్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పురుషోత్తపురం చెక్‌పోస్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒడిశా నుంచి అక్రమ మద్యం, నాటు సారా, గంజాయి వంటి నిషేధ పదార్థాలు అక్రమంగా రవాణా జరగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం స్థానిక ప్రొహిబిషన్ ఎక్సైజ్ కార్యాలయాన్ని సందర్శించి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసులు నమోదుచేయాలని ఆదేశించారు. పెండింగ్ కేసులు లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఎస్‌ఐ పి.డి.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ కుటుంబానికి చేయూత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం/మెళియాపుట్టి : మెళియాపుట్టి ఎండీయూ(బియ్యం పంపిణీ) ఆపరేటర్ సాయిరాజ్ ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు ఎండీయూ ఆపరేటర్స్ అసోసియేషన్ ఆర్థికభరోసా కల్పించింది. మంగళవారం కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ చేతుల మీదుగా రూ.70 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రౌతు సూర్యనారాయణ మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు సేవలు అందించామని, రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 76 మంది ఎండీయూ ఆపరేటర్లు మృత్యువాత పడ్డారని, వారికి ప్రభుత్వం ఆర్థికంగా సహాయపడాలని కోరారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో ఎదురవుతున్న సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు హేమసుందర్, వరహాలు, నరసింహులు, సాయిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో వలలు దగ్ధం



కాలిపోతున్న వలలు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని డి.మత్స్యలేశం పంచాయతీ కొత్తదిబ్బలపాలెం సముద్ర తీరంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో చేపల వలలు దగ్ధమయ్యాయి. ఉదయం 11.30 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగసిపడ్డాయి. ప్లాస్టిక్ తాళ్లతో ఉన్న వలలకు నిప్పంటుకోవడంతో మంటలు అదుపు చేయలేకపోయారు. సమాచారం అందుకున్న శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపు చేశారు. ఈ ఘటనలో వలలు కాలిపోవడంతో లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిందని బాధిత మత్స్యకారులు చీకటి పండువాడు, రాము, సూరాడ కూర్మయ్య, కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. పోలీస్, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. గత అక్టోబర్ 21న డి.మత్స్యలేశం తీరంలోనూ ఇలాగే వలలు కాలిపోయినా ఎందుకు ప్రమాదం జరిగిందో కారణం తెలియలేదు. ప్రమాదమా? వ్యక్తిగత కక్షలతో నిప్పుడు పెడుతున్నారా అన్నది తెలియడం లేదు.

జాతీయ బాస్కెట్‌బాల్ పోటీలకు అక్షయ



సీహెచ్ అక్షయను అభినందిస్తున్న ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అర్జున్‌రెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్–2024 పోటీలకు శ్రీకాకుళం జిల్లాకు చెందిన సీహెచ్ అక్షయ ఎంపికైంది. ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు పంజాబ్‌లోని పటియాల వేదికగా ఈ పోటీలు జరగనున్నాయి. ఇటీవల శ్రీకాకుళంలో జరిగిన 68వ ఏపీ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో అద్భుతమైన ఆటతీరుతో రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికై ంది. కాగా జాతీయ పోటీల కోసం పయనమై వెళ్లిన అక్షయను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి అభినందించి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ప్రాధాన్యం ఏదీ?



- ధాన్యం సేకరణకు పూర్తికాని ప్రక్రియ
- అందుబాటులో లేని పీపీసీ సెంటర్లు
- బ్యాంకు గ్యారంటీ ఇవ్వని మిల్లర్లు
- రాజకీయ ప్రమేయంతో మరింత జాప్యం
- ఇటీవల ఆదరాబాదరగా పీపీసీ ప్రారంభించిన మంత్రి

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతులకు ఈ ఏడాది ఖరీఫ్ సీజనంతా కష్టాలతోనే ముగిసింది. వాతావరణం అనుకూలించకపోవడం, నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించడంలో ప్రభుత్వం విఫలం కావడం వెరసి ఇబ్బందులతోనే అన్నదాతలు నెట్టుకొచ్చారు. ఈ నేపథ్యంలో వరి పంట కోతకొచ్చింది. ధాన్యం అమ్మకాల సీజన్ ప్రారంభమైంది. అయితే కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు, ముందస్తు ప్రణాళిక లేకపోవడం, రైతు సంక్షేమంపై నాయకులు చిత్తశుద్ధి చూపకపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రైతులు వారి దగ్గరిలో ఉన్న మిల్లుకు ధాన్యం పంపించేందుకు వెసులుబాటును కల్పించడంతో ఒత్తిళ్లు, ఇతర సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. దీనికి తోడు ఒడిశా ధాన్యం బెడదకు అడ్డుకట్ట వేసేందుకు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఈ ఏడాది 5 లక్షలు మెట్రిక్ టన్నులు సేకరణ చేస్తే, ఇంకా సుమారు లక్ష మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం రైతుల వద్ద మిగిలి అవకాశం ఉంటుంది. వాటిని కొనుగోలు చేయకపోవడంతో రైతులకు నష్టం తప్పదు. ఇన్ని సమస్యలు ఉంటుండగానే ఆదరాబాదరాగా ఆదివారం కోటబొమ్మాళి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం(పీపీసీ)లను మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించడం గమనార్హం.

గ్రేడ్–ఎ రకం	మద్దతు ధర
క్వింటా	రూ.2,320
80 కేజీలు	రూ.1856
40 కిలోలు	రూ.828
మెట్రిక్‌టన్ను	రూ. 23200

కామన్‌గ్రేడ్	మద్దతు ధర
క్వింటా	రూ.2300
80కేజీలు	రూ.1840
40 కేజీలు	రూ.920
మెట్రిక్‌టన్ను	రూ.23,000

ముందస్తు ప్రణాళిక కరువు..

ఖరీఫ్ ధాన్యం సేకరణకు ముందస్తు ప్రణాళిక వేయలేదు. ఇప్పటికీ పీపీసీ కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటు కాలేదు. గత ఏడాది పీపీసీ ఏజెన్సీలు చక్కగా నిర్వహించినా ఈ ఏడాది మాత్రం టెక్కలి, ఇచ్ఛాపురం, ఎచ్చెర్ల నియోజకవర్గాల్లో కొత్త ఏజెన్సీలకు అవకాశం ఇచ్చారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తి స్థాయిలో ఏర్పాటుకాలేదు. ఒక్కో కేంద్రంలో ముగ్గురు సిబ్బంది(కంప్యూటర్ ఆపరేటర్, తేమ పరీక్షకు టెక్నికల్ సిబ్బంది, నిర్వాహకుడు) ఉండాలి. వీటి ఏర్పాటు పూర్తి స్థాయిలోజరగలేదు. జిల్లాలో ఈ ఏడాది 402 పీపీసీ కేంద్రాల ఏర్పాటుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. వీటిలో 'ఎ' గ్రేడ్ పీపీసీలు 144 (2000 మెట్రిక్ పైబడి కొనుగోలు చేసేవి), 'బి' గ్రేడ్ పీపీసీలు 228 (1000 నుంచి 2000 మెట్రిక్ టన్నులు) 'సి' గ్రేడ్ పీపీసీలు 30(1000 మెట్రిక్ టన్నులు) ఉన్నాయి.

బ్యాంకు గ్యారెంటీలు ఎప్పుడో?

ధాన్యం కొనుగోలు ప్రారంభం నాటికే ఆయా మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారెంటీలు తప్పని సరిగా తీసుకోవాలి. అప్పుడే సేకరించిన ధాన్యం మిల్లులకు పంపించేందుకు అవకాశం ఉంటుంది. ఈ గ్యారెంటీలు లేనిదే ధాన్యం మిల్లర్లకు చేరదు. జిల్లాలోని 260 మిల్లుల్లో ఒక్క మిల్లు కూడా బ్యాంకు గ్యారెంటీని ప్రభుత్వం అందించిన దాఖలాలు లేవు. ఈ ఏడాది 1:1 ప్రాతిపదికన బ్యాంకు గ్యారెంటీలు తీసుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

గోదాముల కొరత..

ఈ ఏడాది సుమారు 5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధం చేశారు. ఆ స్థాయిలో గోదాములను ఏర్పాటు చేయడంలో మాత్రం విఫలమయ్యారు. ప్రస్తుతం 4.31 లక్షల టన్నులు నిల్వ చేసే సామర్థ్యం మాత్రమే ఉంది. ఇందులోనూ గత ఏడాది బియ్యం నిల్వలు ఉన్నాయి.

చాలని గన్నీలు..

ధాన్యం సేకరణకు గతంలో రైతులకు ప్రభుత్వమే నేరుగా గన్నీలు అందజేసేది. ఆ ఆర్థిక భారం ప్రభుత్వమే భరించేది. ఈ ఏడాది గన్నీలు రైతులే సమకూర్చుకోవాలని, ఆ నగదును ప్రభుత్వం చెల్లిస్తుందని చెబుతున్నారు. దీంతో రైతులు అయోమయం చెందుతున్నారు.

చర్యలు తీసుకుంటున్నాం

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతుల నుంచి ధాన్యం సేకరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు ధాన్యం సేకరించి రైతులకు న్యాయం చేస్తాం. ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశాం. ఈ వారంలో అన్ని పీపీసీల్లోనూ ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తాం

– శ్రీనివాసులు, డీఎం సివిల్ సప్లయ్ కార్పొరేషన్, శ్రీకాకుళం

సీజన్	వరి సాగు విస్తీర్ణం	ధాన్యం దిగుబడి	సేకరణ లక్ష్యం
ఖరీఫ్ (2024&25)	3,60,325 ఎకరాలు	7,24,667 మెట్రిక్ టన్నులు(అంచనా)	5 లక్షల మెట్రిక్ టన్నులు

కె.ఎల్.ఎన్.పేటలో భారీ చోరీ

- 16 తులాల బంగారం, 200 గ్రాముల వెండి మాయం



బీరువాలను పరిశీలిస్తున్న పోలీసులు

జలుమూరు: మండలంలోని జోనంకి పంచాయతీ కేఎల్ఎన్‌పేటలో భారీ చోరీ జరిగింది. దొంగలు ఇంట్లోకి చొరబడి బంగారం, వెండి ఆభరణాలు పట్టుకుపోయారు. బాధితురాలు సనపల లక్ష్మి తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మి తన భర్త నాగరాజు చెన్నైలో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండటంతో 20 రోజుల క్రితం అక్కడికి వెళ్లింది. తిరిగి మంగళవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి గేటు తాళం విరగ్గొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా రెండు బీరువాలు తెరిచి దుస్తులు చిందర వందరగా పడేసి ఉన్నాయి. అందులో దాచిన సుమారు 16 తులాల బంగారం, 800 గ్రాముల వెండి ఆభరణాలు పోయినట్లు గుర్తించింది. హోం థియేటర్ సైతం దొంగలు ఎత్తుకెళ్లిపోయారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. ఏడు తులాల పోయినట్లు ఫిర్యాదు ఇవ్వమన్నారని, రశీదులు తెస్తేనే 16 తులాలు పోయినట్లు కేసు నమోదు చేస్తామంటున్నారని ఆమె వాపోయింది. తమ అత్తమామల నుంచి వచ్చిన బంగారం కొంత, కుమార్తె రజస్వల ఫంక్షన్‌కు మరికొంత బంగారం వచ్చిందని, వీటన్నంటికి రశీదులు ఎలా తెస్తానని ఆవేదన వ్యక్తం చేసింది. ఇదిలా ఉండగా.. సమాచారం అందుకున్న శ్రీకాకుళం క్లూస్ టీమ్, నరసన్నపేట సీఐ కె.శ్రీనివాసరావు, జలుమూరు ఎస్‌ఐ అశోక్‌బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బైక్ ఢీకొని ఉపాధ్యాయుడికి గాయాలు



గాయపడిన సోమేశ్వరరావు

మెళియాపుట్టి: మండల కేంద్రం మెళియాపుట్టికి చెందిన ఉపాధ్యాయుడు (గొట్ట హైస్కూల్ హిందీ పండిట్) బత్తుల సోమేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. ఎస్సై రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. సోమేశ్వరరావు సోమవారం రాత్రి బహిర్భూమికని పలాస–పూండి రహదారి దాటుతుండగా ఒడిశా రాష్ట్రం భిన్నాళ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి వేగంగా ఢీకొన్నాడు. తీవ్రంగా గాయపడిన సోమేశ్వరరావును కుటుంబసభ్యులు 108 వాహనం ద్వారా టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించి, అక్కడినుంచి శ్రీకాకుళం రిమ్స్‌లో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

22న జాబ్‌మేళా

శ్రీకాకుళం పాతబస్టాండ్: ముత్తూట్ మైక్రోఫిన్ సంస్థలో ఉద్యోగాలకు ఈ నెల 22న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ కిరణ్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వెనక నెహ్రూ యువ కేంద్రంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు. రిలేషన్‌షిప్ ఆఫీసర్ పోస్టులకు ఇంటర్మీడియట్, బ్రాంచ్ క్రెడిట్ మేనేజర్ పోస్టులకు బీకాం/ఎంబీఏ అర్హత ఉండాలని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలోనే పనిచేయాల్సి ఉంటుందన్నారు. 18 నుంచి 28 ఏళ్ల వయసు గల అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గలవారు హాజరుకావాలన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు తగదు



విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాలు

అరసవల్లి: విద్యుత్ చార్జీలు పెంచేది లేదంటూ గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు అమాంతం చార్జీలను పెంచేసిందని వామపక్ష నేతలు దుయ్యబట్టారు. స్మార్ట్ మీటర్లు అమర్చడాన్ని తక్షణమే నిలిపివేయాలంటూ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ సర్కిల్ కార్యాలయం వద్ద సీపీఐ, సీపీఎం కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావులు మాట్లాడుతూ పాపం పాలకులదైతే.. శిక్ష ప్రజలకా అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోపే రెండు సార్లు చార్జీల పెంపును అమలు చేస్తుండటంపై మండిపడ్డారు. జనాగ్రహం ఇప్పటికే బయటకొచ్చేస్తుందని, పాలకులు చార్జీల పెంపుపై పునరాలోచించి నిర్ణయం తీసుకోకపోతే.. తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. అనంతరం ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం మందుల తయారీదారులకు జైలు శిక్ష

శ్రీకాకుళం క్రైమ్ : ఔషధ చట్ట నిబంధనలు అతిక్రమించి నాసిరకం మందులను తయారుచేస్తున్న యాజమాన్యానికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ శ్రీకాకుళం అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.ఎం.జామృత్‌బేగం మంగళవారం తీర్పు వెలువరించినట్లు డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ చంద్రరావు పేర్కొన్నారు. 2017 అక్టోబరు 30న నగరంలోని హిమాచల్‌ప్రదేశ్‌కు చెందిన ఎతిక్స్ హెల్త్ కేర్ కంపెనీకి అప్పటి శ్రీకాకుళం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.కృష్ణ తనిఖీలకు వెళ్లారు. ఆర్బిజ్–2డి (రేబిప్రజోల్ ఐపీ) ట్యాబ్లెట్లను విశ్లేషణ నిమిత్తం ల్యాబ్‌కు నమూనాలు పంపగా కొన్ని ప్రామాణికాలు లోపించినట్లు గుర్తించారు. యజమానులైన ఎం.డానియల్, ఎస్.జయరాజ్‌లపైనే కాకుండా కంపెనీపైన కూడా కేసు నమోదు చేశారు. ప్రస్తుత డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.యుగంధర్, ఏడీ చంద్రరావులు కేసు నడిపించగా సీనియర్ ఏపీపీ పి.సుశీల వాదనలు వినిపించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ మంగళవారం యజమానులు ఇద్దరు, కంపెనీకి రూ. 25 వేలు చొప్పున మొత్తం రూ.75 వేలు జరిమానా, ఒకరోజు జైలు శిక్ష విధించినట్లు ఏడీ పేర్కొన్నారు.

మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటుచేయాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న ఆదివాసీ సంఘ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం జిల్లాలో మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏను ఏర్పాటు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబయోగి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం శ్రీకాకుళం అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన తెలియజేసి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వాబయోగి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో జిల్లాలో గిరిజనులకు న్యాయం చేసేలా మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటుకు తీర్మానం చేయాలని కోరారు. సీతంపేట ఐటీడీఏ పార్వతీపురం మన్యం జిల్లాకు తరలిపోవడంతో వివిధ పనుల కోసం వ్యయప్రయాసలు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా విభజన సమయంలోనే కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చామని, ప్రతిపక్షంలో ఉన్న తెలుగుదేశం నాయకులు కూడా తమ ప్రభుత్వం వచ్చాక మెళియాపుట్టి కేంద్రంగా ఐటీడీఏ ఏర్పాటు చేస్తామని బహిరంగ ప్రకటనలు చేశారని గుర్తుచేశారు. చంద్రబాబు సైతం ప్రతిపక్ష నేత హోదాలో పాతపట్నం బహిరంగ సభలో శ్రీకాకుళం జిల్లాకు ఐటీడీఏ ఏర్పాటు చేసి ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారని పేర్కొన్నారు. తక్షణమే ఐటీడీఏ ఏర్పాటుచేయకుంటే ఆదివాసీ ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మెళియాపుట్టి మండల అధ్యక్షుడు గణేష్, బూర్జ మండల అధ్యక్షుడు సవర శోభన్, సవర కృష్ణ, సారవకోట మండల అధ్యక్షుడు భాస్కరరావు, దీనబంధిపురం సర్పంచ్ వెంకటేష్, సభ్యులు ఈశ్వరరావు, లచ్చుమయ్య, హరీష్ పాల్గొన్నారు.

బాహుదా, వంశధార నదులను అనుసంధానించండి

- శాసన మండలిలో ఎమ్మెల్సీ నర్తు



శాసన మండలిలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: శ్రీకాకుళం జిల్లాకు శివారు నియోజకవర్గమైన ఇచ్ఛాపురానికి సాగు, తాగునీరు అందించేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు కోరారు. శాసనమండలిలో మంగళవారం స్పెషల్ మెన్షన్ పీరియడ్‌లో మండలిలో ఎమ్మెల్సీ ఈ అంశంపై మాట్లాడారు. జిల్లాలో అపారమైన వనరులు ఉన్నాయని, వాటిని వినియోగించుకుంటే సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. ఒకప్పుడు కొబ్బరి, జీడి మామిడి పంటలు, పచ్చని పైరుతో ఉద్దానం కళకళలాడేదని, ఇప్పుడు చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాలు ఆందోళనకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని వంశధార నదీ జలాలను నేరేడు బేరేజీ నుంచి ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బాహుదా నదికి అనుసంధానం చేయడం ద్వారా ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు.

ఇండియన్ ఆర్మీ కాలింగ్ అకాడమీలో తనిఖీలు



వసతి గదిలో ఉన్న సీసీ కెమెరా

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని ఎల్‌బీఎస్ కాలనీలో ఇండియన్ ఆర్మీ కాలింగ్ అకాడమీ పేరిట సంస్థ నిర్వాహకులు మోసగిస్తున్నారని ఫిర్యాదు రావడంతో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి పోలీసుల విచారణకు ఆదేశించారు. డీఎస్పీ సీహెచ్ వివేకానంద బృందంతో కలసి అకాడమీలో మంగళవారం తనిఖీలు జరిపారు. బాలికలకు వసతి సౌకర్యం, శిక్షణ, సంస్థ అనుమతులపై నిర్వాహకుడు జి.వి.రమణతో మాట్లాడి ఆరా తీశారు. అన్ని అనుమతి పత్రాలను తీసుకురావాలని ఆదేశించారు. కాగా, బాలికల వసతి గదుల్లో సీసీ కెమెరాలు ఉండటంపై ప్రశ్నించగా తమకు తెలిసే పెట్టారని బాలికలు, తల్లిదండ్రులు డీఎస్పీ వద్ద చెప్పారు. ఈ విషయమై ఎస్పీ వద్ద ప్రస్తావించగా ఫిర్యాదు రావడం వాస్తవమేనని, డీఎస్పీతో విచారణ చేయిస్తున్నామని చెప్పారు.

సాయి డెంటల్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఉత్తీర్ణత సాధించిన 2023-24 బ్యాచ్ విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: ఎన్టీఆర్ వైద్యవిశ్వవిద్యాలయం 2023–24 బ్యాచ్‌కు సంబంధించి నిర్వహించిన దంత వైద్య పరీక్షల్లో శ్రీకాకుళం పరిధిలోని పాత్రునివలస వద్ద ఉన్న సాయిడెంటల్ కళాశాల విద్యార్థులు 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల యాజమాన్యం డీఎస్‌రెడ్డి, డాక్టర్ టి.బి.వి.జి.రాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ కృష్ణప్రసాద్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విద్యార్థులను అభినందించారు. ఇందులో 11 మంది విద్యార్థులు డిస్టింక్షన్‌లో పాసైనట్లు తెలిపారు. విద్యార్థుల పట్టుదల, అధ్యాపకుల బోధన, ల్యాబ్‌లు, వైద్య సదుపాయాలు బాగా ఉండటంతో ఈ ఫలితాలు సాధించగలిగామని చెప్పారు. భవిష్యత్తులో నూటికి నూరుశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

డ్రోన్ నిఘా



నాగావళి నదీ పరివాహక ప్రాంతం



డ్రోన్ ఎగురుతోందిలా..



డ్రోన్ విజువల్



కొత్త బ్రిడ్జి వంతెన

జిల్లాకేంద్రంలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్టవేసేందుకు నేర ప్రభావిత ప్రాంతాల్లో, ముఖ్యంగా గంజాయి సేవిస్తున్న నిర్మానుష్య ప్రాంతాలను గుర్తించేందుకు 'డ్రోన్ నిఘా'ను ప్రవేశపెట్టినట్లు ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఫాజుల్‌బేగ్‌పేట్, దత్తాత్రేయ ఆలయం వెనుక భాగాన శ్మశాన వాటిక, నాగావళి నది పరీవాహక పెద్దరెల్లివీధి, డేఅండ్నైట్ శ్మశానవాటిక, శాంతినగర్ కాలనీ, నాగావళి రివర్‌వ్యూ పార్కు, రిమ్స్ హాస్పిటల్ వెనుక భాగం, బలగ, డీసీసీబీ మత్స్యశాఖ కార్యాలయం వెనుక భాగం, ఆర్ట్స్ కళాశాల, ఆర్టీసీ కాంప్లెక్సు పరిధి పాడుబడిన బిల్డింగ్స్‌ను డ్రోన్ కెమెరా నిఘాలో ఉంచారు. గంజాయి వినియోగం, పేకాట, కోడి పందాలు, మద్యం మత్తులో అలజడులు సృష్టించడం వంటి అసాంఘిక కార్యకలాపాలే కాక బాలికలపై ఈవ్‌టీజింగ్, చైన్‌స్నాచింగ్, చోరీలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ వినియోగిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు.

– శ్రీకాకుళం క్రైమ్

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్: భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని సామాజిక న్యాయ పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గాసి గణేష్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం రాజ్యాంగ పరిరక్షణ పోరాటానికి సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా శ్రీకాకుళం ఏడు రోడ్ల కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించనున్నట్లు చెప్పారు. రాజ్యాంగం మార్పు, నిర్వీర్యానికి ప్రయత్నిస్తున్న వారిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కుల నిర్మూలన పోరాట సమితి ఉపాధ్యక్షులు మిస్కా కృష్ణయ్య, టి.రమణ, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రగతికి నైపుణ్యాలే కీలకం



మాట్లాడుతున్న వీసీ రజిని

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థుల ప్రగతికి, భవిష్యత్తుకు నైపుణ్యాలు కీలకమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వీసీ కె.ఆర్.రజిని అన్నారు. వర్సిటీలోని కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మేనేజ్‌మెంట్ దినోత్సవం నిర్వహించారు. మేనేజ్‌మెంట్ పిత పీటర్ డెక్కర్‌కు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ రంగంలో విద్యార్థులు రాణించాలంటే కమ్యూనికేషన్, సాఫ్ట్ స్కిల్స్ పెంపొందించుకోవడం కీలకమని చెప్పారు. ఎంబీఏ పూర్తిచేసిన తర్వాత మేనేజర్లుగా, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.సుజాత, ప్రిన్సిపాల్ అనురాధ, కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ కోఆర్డినేటర్ ఎన్.సంతోష్ రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.